www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 ఆగస్టు 2023
5
వైఎస్ఆర్

రేపు కడప ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - కడప

కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022- 23 సంవత్సరంలో డిగ్రీ పాసైన విద్యార్థులతో పాటు అంతకు ముందు కూడా ఉత్తీర్ణులైన వారికి ఈనెల 26న కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో మహా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో భాగంగా కడపలో మహా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ప్లేస్మెంటరని తెలిపారు. అపోలో ఫార్మసీ, అరబిందో ఫార్మాస్యూటికల్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, హెటిరో ఎల్‌ఐసి ఆఫ్ ఇండియా, ఎస్బిఐ పేమెంట్స్ లిమిటెడ్ మొదలైన 60 కంపెనీలు ఇందులో పాల్గొననున్నట్లు తెలిపారు. సుమారు 2000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.

విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా 'సమరభేరి' : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ బిల్లులు తగ్గించడం, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం నగరంలోని సిపిఎం నగర కార్యాలయంలో 'సమరభేరి' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు, కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రూ.13 లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ, నూరు లక్షల కోట్ల అప్పులు చేస్తూ, పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతుందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసే ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీచేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం, సరళీకరణ విధానాలను అమలు చేయకపోతే అప్పుకి అనుమతి ఇవ్వలేదని అమెరికా బెదిరింపులకు లొంగిపోయిందని పేర్కొన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారన్నారు. ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నారన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అధిక ధరలను అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యావసరాలను అందించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని మార్క్సిస్టు పార్టీ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందన్నారు. ప్రజలను పీడిస్తున్న అధిక ధరలు, రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు అడ్డు, అదుపు లేకుండా ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. పేదలు, మధ్యతరగతి ప్రజానీకం ధరల కోరల్లో చిక్కుకు పోతున్నారని, మోడీ గద్దెనెక్కిన వెంటనే రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ .1200 కు పెరిగిందని, పెట్రోల్, డీజిల్ ఛార్జీలు అంతులేకుండా పెరుగుతూనే ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, పేదలకు ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు క్రమేపీ తగ్గించి ఎత్తేయాలని చూస్తోందని పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు వివిధ రూపాలలో ఆందోళనకు సిపిఐ(ఎం) పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె. శ్రీనివాసులు రెడ్డి, వి.అన్వేష్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ప్రజలకు సంతృప్త స్థాయిలో ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి అర్హులై ఉండి పలు కారణాలతో సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోయిన వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసే 'వైయస్సార్ శాంక్షన్' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీసి ద్వారా బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసి హాలు నుండి కలెక్టర్‌తోపాటు జెసి గణేష్ కుమార్, కడప నగర మేయర్ సురేష్ బాబు, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు పి. శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీసి ముగిసిన 7,996 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం విడుదల చేసిన రూ.11.11 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సంబంధించి 798 మందికి గాను రూ.1.19 కోట్లు, చేదోడు కింద 1,919 మందికి రూ.1.91 కోట్లు, ఐబిస నేస్తం నుండి 509 మందికి రూ.76.39 లక్షలు, నేతన్న నేస్తం ద్వారా నుండి 69 మందికి రూ.16.56 లక్షలు, 0 వడ్డీ పంట రుణాలకు సంబంధించి 916 మంది రూ.1.12 కోట్లు, విద్యా దీవెన కింద 1,918 మందికి గాను రూ.3.39 కోట్లు, వసతి దీవెన కింద 1,424 మంది రూ.1.38 కోట్లు, మహిళా సంఘాలకు మూడు విడతల్లో 443 సంఘాల సభ్యులకు రూ.1.27 కోట్లు... కలిపి మొత్తం 7,996 మంది లబ్ధిదారులకు గాను రూ.11,11,47,871లు విడుదలయిందన్నారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జిల్లాలో సంతృప్త స్థాయిలో అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్‌పిసిఇఒ సుధాకర్ రెడ్డి, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్‌కుమార్, ఎస్ఎస్ఎ పిఒ డాక్టర్ ఎ. ప్రభాకర్‌రెడ్డి, డిఇఒ రాఘవరెడ్డి, ఆర్ఐఒ రమణ రాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

చంద్రయాన్-3 విజయోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో గురువారం భౌతిక శాస్త్ర విభాగం పర్యవేక్షణలో చంద్రయాన్ - 3 విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ చంద్రయాన్ - 3 విజయవంతం కావడంతో భారత్ దేశ కీర్తి మరొక్కసారి ప్రపంచ వ్యాప్తంగా మారుమోగిందని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్ రావు మాట్లాడుతూ చంద్రయాన్ - 3 విజయం వెనుక ఇస్రో శాస్త్రవేత్తల కృషిఎంతో గర్వించదగినదని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధరమూర్తి, బాబు రవిచంద్ర, మల్లికార్జున, కళాశాల అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **వల్లూరు :** భారత ప్రతిష్టను చంద్రయాన్ -3 చాటిందని యాదాల శేషగిరి మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ వంకదారి ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని యాదాల శేషగిరి మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు అందరూ జాతీయ జెండాలు రెపరెపలాడిస్తూ ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు మాట్లాడుతూ చంద్రయాన్-3 చరిత్ర సృష్టించింది అన్నారు. జాబిల్లిపై ఇప్పటివరకు ఏ దేశం దిగని దక్షిణ ధ్రువం పై విక్రమ్ ల్యాండర్ కాలుమోపి భారతదేశంలోనే చరిత్రలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏవో ఉత్తమ రెడ్డి ,పాఠశాల ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **అట్లూరు :** చంద్రయాన్-3 విజయం ప్రతి భారతీయునికీ గర్వకారణం కారణమని ఎంఇఒ ఖాదర్‌వలి పేర్కొన్నారు. స్థానిక అట్లూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అట్లూరులో మానవహారంలో మాట్లాడుతున్న ఎంఇఒ-2, వల్లూరు యాదాల శేషగిరి పాఠశాలలో విద్యార్థుల సంబరాలు

స్కూటర్‌యాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ విద్యా రంగం నిర్వీర్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని, జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర' ను జయప్రదం చేయాలని మాజీ విద్యార్థి నాయకులు జి.చంద్ర శేఖర్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. గురు వారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 350 కిలోమీటర్ల పాటు నిర్వహించనున్న స్కూటర్ యాత్ర ను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. యాత్ర ఒంటిమిట్ట లో ప్రారంభమై భాకరపేట, సిద్దవటం, అట్లూరు, బద్వేలు, పోరుమామిళ్ల, కలసపాడు, బి.మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, పులివెందుల, వెంపల్లి, వైవీయూ మీదుగా ఈ నెల 31న కడపకు చేరుకుని యాత్ర ముగుస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించనున్న స్కూటర్ యాత్రను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునిల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్, మాజీ విద్యార్థి నాయకులు అన్వేష్, లక్ష్మీదేవి, జిల్లా కమిటీ సభ్యులు సురేష్ నాయక్, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కడప

ప్రాధాన్యత రంగాలకు సంబంధించి అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ జి. గణేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, జగనన్న సురక్ష, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ తో పాటు డీఆర్వో గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం సంబందిత శాఖల జిల్లా అధికారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాడు- నేడులో భాగంగా జరుగుతున్న పనులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, సిఇఒ వెంకట్రావు, డిఆర్‌డిఎ, మెప్మా, హౌసింగ్ పీడీలు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

దేశ సేవ మహాభాగ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

భారతదేశ మాతృగడ్డపై జన్మించిన మనం దేశ సేవలో అవకాశం పొందడం మహాభాగ్యంగా భావించాలని న్యూఢిల్లీ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్.అభిలాష్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం మనో విజ్ఞాన శాస్త్ర శాఖ, జాతీయ సేవా పథకం 1 ,4 యూనిట్ల ఆధ్వర్యంలో 'జాతీయ సమైక్యత - భద్రత' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని క్యాంపస్ లోని సర్ సివి రామన్ విజ్ఞాన భవనంలో గురువారం నిర్వహించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్.అభిలాష్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో బిటెక్ మెకానికల్ ఇంజినీర్ కోర్స్ చదివిన నేను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాసి మొదటిసారిలోనే సైనిక విభాగంలో చేరనన్నారు. న్ఎస్ఎస్ వైవీయూ సమన్వయకర్త డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ రంగంలోకి యువత అడగడాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమం కన్వీనర్లు డా వేపరాల లాజర్, డాక్టర్ ఎస్.సునీత కార్యక్రమ ఉద్దేశం నెరవేరిందని దేశ సైనికుడికి అభినందనలు తెలిపారు.

విద్యార్థినికి ఫొటోగ్రఫీలో మెరిట్ అవార్డు

కడప అర్బన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో నాలుగవ సంవత్సరం చదువుతున్న ఫొటో గ్రఫీ డిపార్టమెంట్‌కు చెందిన తేజశ్వినికి డాక్టర్ భగవాన్‌దాస్, బండి రాజన్ బాబు మెమోరియల్ ఫోటోగ్రఫీలో పొట్రైట్ విభాగంలో ఉత్తమ మెరిట్ అవార్డు లభించింది. డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ విద్యార్థినిని అభినందించారు. యూనివర్సిటీకి ఇంకా మంచి అవార్డులు తీసుకురావాలని కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ప్రజాశక్తి - కడప అర్బన్

అక్రమ సంపాదనలు ఈడీ కేసుల్లో 17 నెలలు జైలు జీవితం గడిపి నేటికీ ముద్దాయిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన చేస్తూ చరిత్రహీనుడిగా మిగిలిపోయారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీకి నిధులు నిలుపుదల చేయడం, పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చడం దుర్మార్గమని చెప్పారు. ఎన్నికలకు ముందు పేదలకు 25 లక్షల పక్క గృహాలు నిర్మించి ఇస్తామని, నేటికీ 2 లక్షలు ఇళ్లు కూడా పూర్తి చేయకపోవడం శోచనీయమని వాపోయారు. మూడు రాజధానుల తరలింపు నిరసన కారుల పై 144 సెక్షన్, ఎస్సీల పైన అట్రాసిటీ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాజర్ ఆలీ, నగర తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రాష్ట్ర మానవ హక్కుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వి రమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలదాసు

సిఎంను కలిసిన ఇలియాస్, బాలిరెడ్డి

ప్రజాశక్తి - కడప

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, వైసిపి గ్లోబల్ కన్వీనర్ మేడపాటి వెంకట్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం గల్ఫ్ కన్వీనర్ బీ.హెచ్. ఇలియాస్, వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎంకు మెమొంటోను అందజేశారు. వారు చేస్తున్న సేవలను డిప్యూటీ సిఎం, మేడపాటి సిఎంకు వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఖత్తర్ కన్వీనర్ దొండపాటి శశికిరణ్, దుబాయి కన్వీనర్ సయ్యద్ అక్రమ్, సౌదీ అరేబియా కన్వీనర్ రెవెల్ అంథోని , కువైట్ ఎపిఎ న్ఆర్‌టిఎస్ రీజినల్ కో - ఆర్డినేటర్లు నాయని మహేష్‌రెడ్డి, ఎం .వి. నరసారెడ్డి, దుబాయి సీనియర్ మైనారిటీ నాయకులు సయ్యద్ నాసర్ ఆలీ ఉన్నారు. గల్ఫ్ టీం సభ్యులు మాట్లాడుతూ 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయానుగుణంగా 175 కు 175 సీట్లు వచ్చేటట్లు గల్ఫ్ టీం ఇండియా వచ్చి పని చేస్తుందని తెలిపారు.

సిఎంకు మెమొంటోతో అందజేస్తున్న ఇలియాస్, బాలిరెడ్డి

ఊటుకూరు చెరువును అభివృద్ధి చేస్తాం

కడప : ఊటుకూరు చెరువును ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని కమిషనర్ సాయిప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. గత నెల కడప పర్యటన భాగంగా ముఖ్యమంత్రికి ఊటుకూరు కార్పొరేటర్ గుత్తిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి విన్నవించారు. అందుకు ముఖ్యమంత్రి స్పందించి వెంటనే కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్‌ను అంచనాలు తయారు చేసి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అందులో భాగంగా కమిషనర్ పలుమార్లు ప్రకృతి నగర్ చెరువు కట్ట వద్ద పరిశీలించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఏడు రోడ్ల వద్ద ఉన్న డాక్టర్ సాయి ప్రసాద్‌రెడ్డి డెంటల్ ఆసుపత్రిలో గురువారం లయన్స్ క్లబ్ కడప, అన్నమయ్య ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంత సంరక్షణ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, ఉపాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి, వి.గౌరీ శంకర్, కోశాధికారి దేవతి రవీంద్రనాథ్, డాక్టర్ ఆర్. రంగనాథ్ రెడ్డి, ముకేష్, మనీష్ చౌదరి, గంగాధర్, బాబు పాల్గొన్నారు.

దంత శిబిరంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

మహిళలకు పెద్దపీట

ప్రజాశక్తి-కాశినాయన

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే రాష్ట్రంలోని మహిళలందరికీ అనేక సంక్షేమ పథకాలతో పెద్దపీట వేస్తారని మండల తెలుగు యువత అధ్యక్షుడు రవీంద్రారెడ్డి పేర్కొన్నారు గురువారం ఆయన ఇటుకులపాడు సావిశెట్టిపల్లె గ్రామపంచాయతీలలో పర్యటించి టిడిపి కార్యకర్తలతో కలసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ రూ.1500 పంపిణీ చేస్తామన్నారు. తల్లికి వందనం పథకం కింద పాఠశాలకు వెళ్లే పిల్లవాడికి రూ. 5000 చొప్పున పంపిణీ చేస్తామన్నారు . ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కరపత్రాలు అందజేస్తున్న రవీంద్రారెడ్డి

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - వల్లూరు

ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డిఎంహెచ్ఒ నాగరాజు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని లేబాక వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. గర్భిణీలకు అందుతున్న సమాచారం సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు అందుతున్న సేవలు, పోషక విలువల గురించి తెలుసుకున్నారు. ఆహారం, ఐరన్ మాత్రలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత ఉన్నప్పుడు వ్యాధులు దరిచేరవని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర, సిహెచ్ఒ వేణుగోపాల్, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్ హెచ్‌పి సునీల్ కుమార్, రత్నం, ఎఎన్ఎం మేరీ, ఆశా వర్కర్ నాగమ్మ పాల్గొన్నారు.

'ఎన్ఆర్‌టిఎస్ మేలు మరువలేను'

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సభ్యులు చేసిన మేలు జీవితంలో మరచి పోలేనని కె. కనక దుర్గ అన్నారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ విశాఖ పట్నం (అర్బన్) ఎంవిపి కాలనీకి చెందిన తాను ఏడాదిన్నర కిందట కువైట్‌కు వెళ్లానని, అక్కడ ఇంటి పనికి కుది రానని, రెండు నెలలుగా సేఠ్ తనను ఇబ్బంది పెడుతున్నారని, ఐదు రోజుల కిందట వైసిపి కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి వచ్చిన సందర్భంగా తన కష్టాలు వివరించారనని చెప్పారు. ఎలాగైనా ఇండియాకు పంపాలని కోరానని ఆయన స్పందించి ఎంబసి అధికారులతో మాట్లాడి ఎపిఎన్ఆర్‌టిఎస్ ప్రొవిజనల్ కో - ఆర్డినేటర్ బాషా చేత ఎంబసికి పంపించి పాస్‌పోర్ట్ తయారు చేయించి ఇండియాకు రప్పించారన్నారు. తనకి ఇంత సాయం చేసి చేసి ఆదుకున్న ముమ్మడి బాలిరెడ్డికి ప్రొద్దుటూరు బాషకు, ఎంబసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇండియాకు చేరుకున్న కనక దుర్గ

స్థల వివాదంపై ఘర్షణ

- వైసిపికి చెందిన ఇరు గ్రూపులు కత్తులు, రాళ్లతో దాడులు
- 8 మందికి రక్త గాయాలు
- గాయపడిన వారిని ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని వైఎస్ మదీనాపురంలో వైసిపికి చెందిన ఇరు గ్రూపులకు చెందిన ముస్లిమ్ మైనార్టీలు స్థల వివాదంలో ఘర్షణ పడ్డారు. కత్తులు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో 8 మందికి రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఘర్షణ పడుతున్న ఇరు గ్రూపులకు చెందిన వారిని చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని వేంపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికులు, బాధితుల సమాచారం మేరకు.. వైఎస్ మదీనాపురంలో కొన్నేళ్ల కిందట కీ.శే. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముస్లిమ్ మైనార్టీలకు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అప్పటి నుంచి వైసిపికి చెందిన చిన్న ఖాసీం తన కుటుంబ సభ్యులతో అక్కడే నివాసం ఉంటున్నారు. ఇదే గ్రామంలోని మరో ప్రాంతంలో అదేపార్టీకి చెందిన గుజిరి దర్బార్ కూడా నివాసముంటున్నారు. చిన్న ఖాసీం నివాసముంటున్న ప్రాంతంలోని స్థలాన్ని గురిజి దర్బార్ కొనుగోలు చేశారు. కొద్ది నెలల కిందట కొనుగోలు చేసిన స్థలాన్ని చదును చేసి కొలతలు వేశారు. అయితే చిన్న ఖాసీం ఇంటికి చెందిన బాత్‌రూమ్ గురిజ దర్బార్ చేసిన స్థలంలో ఉండడంతో తొలగించాలని ఒత్తిడి తెచ్చారు. తనకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలోనే బాత్‌రూమ్ ఉందని తాను తొలగించనని చిన్నఖాసీం దర్బార్ చెప్పారు. ఈ విషయంపై వారు కొద్ది నెలల నుంచి వాదనలు చేసుకునేవారు. స్థానిక వైసిపికి చెందిన నాయకులు వారిద్దరి మధ్య పంచాయితీలుచేసినా సయోధ్య కుదరలేదు. మనస్పర్థలు తీవ్రస్థాయికి చేరుకున్న నేపథ్యంలో గురువారం వైసిపికి చెందిన నేత వారిద్దరిని పిలిచి మరో సారి నచ్చజెప్పే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఇరు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరు గ్రూపు వ్యక్తులు, కత్తులు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో చిన్నఖాసీంకు, ఆయన కుమారుడు ఉమర్‌కు కత్తిపోట్లు పడ్డాయి. మహ్మదర్‌రఫీ, అమ్మద్ అనే వ్యక్తులకూ గాయాలయ్యాయి. మరో గ్రూపుకు చెందని గుజిరి దర్బార్‌కు, ఆయన కుమారుడు సయ్యద్ నాసర్, పఠాన్ హసన్, సయ్య రసీద్ గాయపడ్డారు. ఘర్షణలకు పాల్పడ్డంతో స్థానికంగా ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది. స్థానికులు ఉలిక్కిపడ్డారు. సిఐ, ఎస్ఐ రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి గంగరాజు గాయపడిన వారిని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఇరు గ్రూపుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ పేర్కొన్నారు.

ఘర్షణలో గాయపడిన ఇరు గ్రూపులకు చెందిన వ్యక్తులు

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో మూడు లక్షలమంది సిపిఎస్ ఉద్యోగుల ఆకాంక్షలను చిదిమేస్తూ గ్యారంటీడ్ పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం చర్చలను బహిష్కరిస్తున్నట్లు యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బాధను విజయకుమార్ పాలెం మహేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం ఏప్రియల్ నెలలో పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకై యుటియఫ్ చేపట్టిన ఉద్యమాన్ని నిరంకుశంగా అణచివేయడమే కాకుండా యుటియఫ్ నాయకత్వం హాజరు కాకుండా చేసి సిపిఎస్ స్థానంలో జిపిఎస్ ప్రవేశ పెడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి విదితమే అని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్కు మరో ప్రతిరూపమే తప్ప ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. చివరగా 50శాతం పెన్షన్ ఇస్తామని, డిఏ కూడా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా సిపిఎస్ ఉద్యోగులు సంతృప్తి చెందడం లేదని తెలిపారు. 40-70 సంవత్సరాల తర్వాత ప్రభుత్వంపై పెద్ద మొత్తంలో ఆర్థిక భారం పడుతుదంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు.

సజ్జలతో ఎమ్మెల్సీ అసమ్మతి నేతల భేటీ వాయిదా

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డితో ఎమ్మెల్సీ అసమ్మతి నేతల భేటీ వాయిదా పడినట్లు సమాచారం. నియోజకవర్గంలోని ఓ బలమైన నాయకుడి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి. కోడూరు మండలాల ప్రజాప్రతినిధులు సజ్జలతో భేటీ కానున్నారని కథనం గురువారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురిమైంది. విషయం తెలుసుకున్న నియోజకవర్గ అధిష్టానం కింది స్థాయి నాయకులపైనా ఒత్తిడి తేవడం, జిల్లా నాయకత్వం నుంచి కూడా ఒత్తిడి రావడంతో తాత్కాలికంగా భేటీ వాయిదా వేసుకున్నట్లు తెలిసింది.

విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గ జిల్లా ప్రజా పరిషత్ ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, మహిళా పోలీసు, వెల్ఫేర్ అసిస్టెంట్లు వారిని బడిలో చేర్పించేలా చూడాలన్నారు. పాఠశాలల్లో సమస్యల గురించి చర్చించారు. పాఠశాల కమిటీ సభ్యుల సమన్వయంతో బడుల అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఎంఇఒ వీరారెడ్డి, నియోజకవర్గంలోని ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి

ఆర్‌పిఎఫ్ తాలూకా అధ్యక్షులుగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల తాలూకాకు సంబంధించి రాయల్ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్‌పిఎఫ్) అధ్యక్షులుగా స్థానిక శ్రీపతి శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా బుధవారం తిరుపతిలో జరిగిన ఆర్‌పిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ రాయల్ అధ్యక్షతన నూతన తాలూకా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీపతి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఆ మేరకు గురువారం శ్రీనివాసులు పులివెందులలో తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌పిఎఫ్ అధ్యక్షులు తనపై నమ్మ కం ఉంచి పదవి ఇచ్చారని తెలిపారు. బలిజ దేవర సాధన కోసం, బలిజల అభివృద్ధి, ఐక్యతకు కృషి చేస్తానన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుండి పోరాడేందుకు ఆర్‌పిఎఫ్‌లోకి వచ్చానని తెలిపారు.

బ్యాంకు రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

బ్యాంకు రుణాలతో ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని, శ్రీనిధి రుణాలు ఉపయోగించుకొని జీవనోపాదులు ఏర్పాటుకు పాటుపడాలని మండల మహిళా సమాఖ్య ఎపిఎం వెంకటరమణ రాజు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలోని స్త్రీశక్తిభవన్‌లో గురువారం మండల సమాఖ్య వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మహిళ మార్పు గురించి అవగాహన కల్పించారు. మండల సమాఖ్య ఆఫీస్ బ్యారర్స్ అధ్యక్షురాలుగా సరిత, ఉపాధ్యక్షురాలిగా శివమ్మ, కార్యదర్శిగా హజీరా, కోశాధికారిగా మల్లీశ్వరి, ఉప కార్యదర్శిగా నవనీతను ఎన్నుకున్నట్లు ఎపిఎం తెలిపారు. కార్యక్రమంలో వెలుగు కార్యాలయ సిసిలు, ఆనిమేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులుగా విమానం చక్కర్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో రెండు రోజుల నుంచి విమానం చక్కర్లు కొడుతోంది. బుధ, గురువారాల్లో రోజుకు 7, 8 సార్లు విమానం చక్కర్లు కొట్టింది. ముఖ్యంగా బిదినంచెర్ల, గురజాల, సింహాద్రిపురం గ్రామాలపై విమానం తక్కువ ఎత్తులో అటుఇటు రాకపోకలు సాగించింది. తక్కువ ఎత్తులో విమానం తిరగడంపై నిక్షేపాల కోసం సర్వే చేస్తున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. విమానం తిరగడంపై ప్రజల్లో చర్చనీయాంశమైంది. దీనిపై తహశీల్దార్ మహ బూబ్ బాషాను అడగ్గా తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

టిడ్కో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలో పేద ప్రజల కోసం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్ల పట్టాలను గురువారం స్థానిక కౌన్సిలర్లు లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక 1వ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1వ వార్డ్ కౌన్సిలర్ థెరీసమ్మ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని దాదాపు 1300 పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తమ సొంతింటి కలను నెరవేర్చారని పేర్కొన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ అలీ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో 1వ వార్డు ఇన్‌ఛార్జి ప్రశాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపక నియామకాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగంలో అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. అధ్యాపకులు తమ బయోడేటా, సంబంధిత విద్యా అర్హత పత్రాలతో ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు. నెట్‌సెట్, పిహెచ్‌డి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా జయహో భారత్ ర్యాలీ

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన మొదటి దేశంగా భారత్ రికార్డు సృష్టించడం ప్రజలందరికి గర్వకారణమని ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి అన్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల గురువారం ఉషాకిరణ్ పాఠశాల ఆధ్వర్యంలో ఆంటిసి బస్టాండ్ నుండి పుర వీధుల గుండా నాలుగు రోడ్ల కూడలి వరకు 500 అడుగుల భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు జయహో భారత్ అంటూ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ఎస్ఐ తిరుపాల్ నాయక్ ప్రారంభించారు. నాలుగు రోడ్ల కూడలిలో భారీగా బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. జాతీయ పంతాకంతో మానవహారం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన భారత్ నిలవడం దేశ ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ రోజు భారత దేశ ప్రజలకు మహత్తరమైన రోజు అన్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడానికి ఇస్రో శాస్త్రవేత్తల కఠోరశ్రమ, అంకిత భావం ఉందన్నారు. ఈ మిషన్ విజయవంతం కావడానికి ప్రధాని మోడీ చేసిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక బిడ్డాల మిట్టలో ఉన్న వికాష్ పాఠశాల విద్యార్థులు బిడ్డాలమిట్ట, శ్రీరాం నగర్ ప్రాంతాల్లో జాతీయ జెండాతో విజయోత్సవ ర్యాలీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వికాష్ పాఠశాల వ్యవస్థాపకులు నజీర్ బాషా, కరస్పాండెంట్ రఫీయా, ఉషాకిరణ్, వికాష్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలో ఉషాకిరణ్ పాఠశాల విద్యార్థులు

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

సుంకేసులలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. సుంకేసులలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలను నమ్మవద్దని, రానున్న ఎన్నికల్లో కూడా వైసిపినే గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మూలే శ్రీనాథ్‌రెడ్డి ఎమ్మెల్యే రఘు రామిరెడ్డిని, ఆయన తనయుడు మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డిని, ఎపిఐఐసిరాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డిని, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, నాయకులు కొత్తపేట గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ మురళీ మోహన్‌రెడ్డి, పెద్దరెడ్డి, ఇరగం నాగేశ్వరరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి, నాయకులు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కరెంట్ కోతలు.. ప్రజలు, రైతులకు అవస్థలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కరెంట్ కోతలు రోజు రోజూ పెరుగుతున్నాయి. ఇటు ప్రజలు, రైతులు అవస్తలు పడుతున్నారు. కరెంట్ కోతలతో ఇళ్లల్లోని వారు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మరోవైపు రైతులు వర్షాల్లేక పంటలను కాపాడుకునేందుకు అల్లాడిపోతున్నారు. మిరప, పసుపు పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. రెండు రోజుల నుంచి కోతలు అధికం కావడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. పగటి పూట కరెంటు కోత పెడుతూ రాత్రి పూట రెండు గంటలు మాత్రమే అధికారులు వదులుతున్నారు. రాత్రిళ్ళు పొలాల గట్టు మీద తిరిగే సమయంలో చల్లటి గాలికి విష పురుగులు వచ్చి గడ్డిలో పడుకొని ఉంటాయని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటి వద్దనే ఉంటే పంటను దక్కించుకోలేమని వారు అల్లాడిపోతున్నారు. కరెంటు రావడం, పోవడం ఎప్పుడో తెలియక రైతులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కోతలు లేకుండా పగటి పూట 9 గంటల కరెంటు వదిలేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అప్రకటిత కరెంటు కోతలు ఎత్తేయాలి : సిపిఎం

కరెంటు ఛార్జీలు పెంపుతో ఓ వైపు ప్రజలు సతమ తమవుతుంటే, మరోవైపు అప్రకటితంగా రాత్రి, పగలు తేడా లేకుండా బ్రేక్‌డౌన్ పేరుతో కరెంట్ కట్ చేస్తున్నారని, దీన్ని ఎత్తేయాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివనారాయణ కోరారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కరెంటు కోత మూలంగా వర్షాకాలం అయినా ఉక్కపోత, దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. కరెంట్ ఛార్జీలు ఇబ్బడి ముబ్బడిగా పెంచడంపై ఉన్న శ్రద్ధ సరఫరాలో ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. పట్టణ కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే మారుమూల గ్రామా ల్లో, మండల కేంద్రాల్లో ఎలా కోతలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీరణాల శివనారాయణ

సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు ఆటల పోటీలు

లింగాల : పులివెందుల నియోజక వర్గంలోని వేల్పుల గ్రామంలో మోడల్ సచివాలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఏడు మండలాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మీదేవి క్రీడా కారులను పరిచయం చేసుకొని ఆటలు ప్రారంభించారు. అనం తరం క్రికెట్, కబడ్డీ, వాలీ బాల్, జంపింగ్, రంగవల్లి వంటి పోటీలు నిర్వ హించారు. పులివెందుల ఫైనల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహు మతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్ర నాథ్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపిపి

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంట సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ ఎడిఎ వెంకటసుబ్బయ్య రైతులకు సూచించారు. బొందల కుంట గ్రామంలో గురువారం ఎడిఎ ఆధ్వర్యంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి వేరుశనగ పంటలో పొలంబడి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలంబడి శిక్షణ ద్వారా రైతులు తమ సొంత నిర్ణయాలతో పంటలు సాగు చేసే నిష్ణాతులుగా (శాస్త్రవేత్త)గా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయమన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి ఆదాయం పొందేలా రైతును తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పంట సాగులో శత్రు పురుగులు, మిత్ర పురుగులు నిష్పత్తిని కలుపు మొక్కల సాంద్రతను, పంట పెరుగుదల దశను, మొక్కల సాంద్రతను, వాతావరణ పరిస్థితుల అంశాలను పరిశీలిం చనున్నట్లు తెలిపారు. అనంతరం చీడపీడల ఉధృతిని గమనించి తగిన సస్యరక్షణ చర్యలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పొలంబడి కార్యక్రమంలో అధికారులు, రైతులు

రైతులు పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-లింగాల

రైతులు సాగు చేసిన తమ పంటలను తప్పనిసరిగా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని పులివెందుల వ్యవసాయ ఎడి అశోక్‌రెడ్డి తెలిపారు. గురువారం ఇప్పట్ల గ్రామంలో పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి సర్వే నంబర్ రైతులు ఏ పంటను సాగు చేశారో ఆ పంట వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ రమేష్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు : నగదు స్వాధీనం

సింహాద్రిపురం : మండలంలోని నిడివెలగల సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారినుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ సమాచార మేరకు పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.22,100 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచామన్నారు. పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ప్రజలను సూచించారు.

ఆలయ ప్రారంభానికి రావాలని సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శ్రీకృష్ణ దేవాలయ ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పులివెందుల నాయకులు కోరారు. గురువారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పొల్యూషన్ బోర్డు మెంబర్ శివకృష్ణారెడ్డి, రాష్ట్ర మాజీ యాదవ సంఘం అధ్యక్షుడు మరక నాగిరెడ్డి యాదవ్ ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. పట్టణంలో రెండు కోట్ల రూపాయలతో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయ ప్రారంభోత్సవం సెప్టెంబర్ 1న జరుగనుంది. ఈ వేడుకల్లో పాల్గొనాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని మరక శివ కృష్ణారెడ్డి తెలిపారు.

సిఎంకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

గత పాలకుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధి జరగలేదు

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - పొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గత పాలకుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మీనాపురం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తాము కృత నిశ్చయంతో ఉన్నామని పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే మీనాపురం గ్రామంలో రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించారు. గతంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు, వైసిపి నేతలు, కార్యకర్తలు గ్రామానికి రోడ్డు కావాలని కోరారన్నారు. గ్రామాన్ని పూర్తి అభివృద్ధి పథంలో నడిపించి 2024 ఎన్నికల్లో మీ ముందుకు వస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావాలన్న తానే ముందుండి కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గాన్ని శాంతియుతంగా ఉండేందుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని, వచ్చే ఎన్నికల్లో విపక్షాలు డబ్బు ఎరగా చూపే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచు గురుస్వామి, ఎంపిటిసి పేరం సునీత బ్రహ్మానందరెడ్డి, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణరెడ్డి, మీనాపురం గ్రామ నాయకులు శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడప ఉక్కు కోసం ఈ నెల 25న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్పీ డిగ్రీ కళాశాలలో ఆయన రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ 'నిరుద్యోగం-పరిష్కార మార్గాలు' అనే అంశంపై జాతీయ సదస్సుకు చెందిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రాఘవా, ఉదయ్, సూరి పాల్గొన్నారు.

నేడు ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశం

ఖాజీపేట : ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిపి అబుబకర్ సిద్ధిక్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే ఖాజీపేట గ్రామ సచివాలయం-1 పరిధిలోని ఇబిసి కాలనీ, ఇందిరా కాలనీలో ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. వైసిపి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

చెరువులో ఆక్రమణలు అరికట్టాలని ఫిర్యాదు

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె, నాగులపల్లె చెరువు పరిధిలో సర్వేనెంబర్ 394లో 228 ఎకరాల విస్తీర్ణం ఉందని, ఇందులో కొంత భాగం ఆక్రమణలు జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా మైనార్టీ కన్వీనర్ షేక్ మహబూబ్ బాషా కోరారు. ఆ మేరకు గురువారం ఆయన ఆర్‌డిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ సుభానికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన నాసిర్ సర్వేనెంబర్ 386లో ప్లాట్ల నిర్మాణం చేపడుతూ చుట్టూ ఉన్న చెరువు స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ ఇబ్బంది స్పందించి 228 ఎకరాల విస్తీర్ణం గుర్తించాలన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో వసతులు కల్పించాలి

చాపాడు : మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్‌కు రాత్రి సమయంలో వచ్చే ప్రయాణికులకు భయం తొలగించేందుకు పట్టణంలోని ప్రధాన రోడ్డు నుండి బస్టాండ్ వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ డిపో మేనేజర్‌ను కోరారు. ఆ మేరకు ఆయన గురువారం రైతు సేవా సమితి సభ్యులతో కలిసి సమస్యలను వివరించారు. బస్టాండ్ వచ్చే ప్రయాణికులు రాత్రి 6 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ప్రధాన రోడ్డు నుండి చీకటిగా ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు మెరుగు పరచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు శ్రీనివాసులు, మాధవరెడ్డి, గోపాల్, ఆటో బాషా పాల్గొన్నారు.

KSRM COLLEGE OF ENGINEERING
(UGC - Autonomous)
Kadapa, Andhra Pradesh, India– 516 005
Approved by AICTE, New Delhi & Affiliated to JNTUA, Ananthapuramu.
KSNR lives on..
NOTIFICATION FOR ADMISSION INTO I B.TECH. UNDER CATEGORY–B NON NRI FOR ACADEMIC YEAR 2023-2024
ADMISSION NOTIFICATION FOR CATEGORY - B NON NRI SEATS 2023-24
Applications are invited from eligible(Non-NRI) candidates for admission into 1st year B.Tech under Category - B NON NRI seats for the acadamic year 2023-24 as detailed given below

B. Tech Courses	CIVIL	EEE	MECH	ECE	CSE	AI&ML
Sanctioned Intake	120	60	120	180	180	60
15% category - B Non-NRI Seats + Vacant NRI seats	36	18	36	54	54	18
Fees	75,000/-	75,000/-	75,000/-	1,50,000/-	1,80,000/-	1,60,000/-

Application can be downloaded from the website www.ksrmce.ac.in or obtained from college office. Filled in applications together with copies of relevant certificates shall be submitted in the college office in person on or before 05.09.2023 Admissions will be made as per the guidelines of APSCHE.
Note: Artificial Intelligence & Machine Learning, Check out this QR-Code for additional information:
EAPCET Code: KSRM
CONTACT PHONE NUMBERS
9440352335, 9493339222, 9440169375, 9849777831, 9398151350, 8919936410
ksrmceofficial www.ksrmce.ac.in 8143731980, 8575697569

K.L.M. COLLEGE OF ENGINEERING FOR WOMEN-KADAPA
(Under the auspicious of Smt. Kandula Lakshumma Memorial Educational Society Reg.395/2007)
(Approved by AICTE, New Delhi & Affiliated to JNTUA, Anantapuramu)
An ISO 9001: 2008 Certified Institute
KSNR lives on..
NOTIFICATION FOR ADMISSION INTO I B.TECH. UNDER CATEGORY–B Non-NRI FOR ACADEMIC YEAR 2023-2024
ADMISSION NOTIFICATION FOR CATEGORY - B NON-NRI SEATS 2023-24
Applications are invited from eligible(Non-NRI) candidates for admission into 1st year B.Tech under category - B Non-NRI seats for the acadamic year 2023-24 as detailed below

B.Tech Courses	CSE	ECE	AI&ML	AI&DS
Sanctioned intake	120	60	60	60
15% category - B Non NRI- seats + vacant NRI seats	36	18	18	18
Fees	50,000/-	45,000/-	45,000/-	45,000/-

Application can be downloaded from the website www.klmcew.ac.in or obtained from college office. filled in applications together with copies of relevant certificates shall be submitted in the college office in person on or before 05-09-2023 Admissions will be made as per the guidelines of APSCHE.
EAPCET Code: KLMW
CONTACT PHONE NUMBERS
85558 71782 - 91777 29199 - 98666 59594 - 94405 18363 -97058 92302 - 94412 10167
klmcewofficials www.klmcew.ac.in 8555871782, 9642422008

An ISO 9001:2015 CERTIFIED INSTITUTION
GOUTHAMI INSTITUTE OF TECHNOLOGY & MANAGEMENT FOR WOMEN
(Approved by AICTE, New Delhi S.B.T.E.T., AP & Affiliated to JNTUA)
Sainagar, Peddasettypalli (V.) PRODDATUR, Kadapa Dist. A.P.
gitamwpdtr@gmail.com Cell : 98483 49885, 9849570557, 9642076632
I B.Tech., Category - B Admissions for EAPCET : 2023-24
Courses : CSE, CSE (AI & ML), ECE, EEE
Eligible candidates for admission into I B.Tech. Courses who have not taken admission on any college can attend Category-B Admissions at 10:00 AM on 26-08-2023 at the College Premises with all Original Documents and required fee. Admissions will be made as per guidelines given by Convener, AP EAPCET - 2023-24
Date : 25.08.2023
PRINCIPAL

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No.123/2021
I.P.No.44/2014
లోటన్‌సాబ్ అన్వర్ @ లోటన్ అన్వర్ తండ్రి గౌస్, 42 సం॥ ముస్లిం,డ్రైవర్,ఇంటి నెం.665,రాజీవ్ నగర్ కాలనీ, పొన్నతోట రోడ్డు,జమ్మలమడుగు, మండలం, కడప జిల్లా ...పిటిషనర్/క్రెడిటార్
VS
లోటన్‌సాబ్ ఖాధరవల్లి @ లోటన్ ఖాదర్ వల్లి, తండ్రి రసూల్ సాహెబ్,వయస్సు 33 సం॥,ముస్లిం, వ్యాపారము,డి.నెం.18/256,బొల్లవరం రామయ్య వీధి, జమ్మలమడుగు టౌన్ మరియు మండలం,కడప జిల్లా ...రెస్పాండెంటు/ డెబిటార్ నెం.1
నోటీసు
పై పిటిషన్ నెం.I.A.No.123/2021 in I.P.No.44/2014 నెంబరు పిటిషన్ ను పిటిషనర్/క్రెడిటార్, రెస్పాండెంట్/డెబిటార్ నెం.1 అయిన మీ పైన రాజశ్రీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినారు. అట్టి పిటిషన్‌లో మీరు 20-10-2023వ తేదీన ఉదయం 10-30 గంటలకు రాజశ్రీ కోర్టునకు హాజరై మీ ఆక్షేపణలు మీ ద్వారాగాని వకీలు ద్వారా గాని తెలియజేయగలరు. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా చేసి మీకు పరోక్షముగా తీర్మానించబడను.
వాయిదా : 20-10-2023
ఎం.కరీముల్లా అలీ బేగ్
వాది తరపున అడ్వకేట్, ప్రొద్దుటూరు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No.56/2020
మద్దిలేటిగారి జయలక్ష్మమ్మ, భర్త నారాయణ, వయస్సు 68 సం॥, హిందూ,గృహిణి, డి.నెం.4/898-1, గీతాశ్రమము రోడ్డు వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా ...వాది
VS
పల్లా రామక్రిష్ణా,తండ్రి ఓబయ్య,వయస్సు 54 సం॥, హిందూ, వ్యాపారము, పాత అడ్రస్సు గుంతచేపాడు గ్రామం,చాపాడు మండలం,కడప జిల్లా ప్రస్తుత అడ్రస్సు ప్లాట్ నెం.205,గోకుల్ అపార్ట్‌మెంటు, వై.యం.ఆర్.కాలనీ,ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా ...ప్రతివాది
దావా సమను
పై నెంబరు దావాను, వాది,ప్రతివాది యైన మీ పైన రాజశ్రీ కోర్టులో దావా దాఖలు చేసినారు. అట్టి దావాలో ప్రతివాది అయిన మీరు 06-09-2023వ తేదీన ఉదయం 10-30 గంటలకు రాజశ్రీ కోర్టునకు హాజరై మీ ఆక్షేపణలు మీ ద్వారాగాని వకీలు ద్వారా గాని తెలియజేయగలరు. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా చేసి మీకు పరోక్షముగా తీర్మానించబడను.
వాయిదా : 06-09-2023
ఎం.కరీముల్లా అలీ బేగ్
వాది తరపున అడ్వకేట్, ప్రొద్దుటూరు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No.789/2020
O.S.No.56/2020
మద్దిలేటిగారి జయలక్ష్మమ్మ, భర్త నారాయణ, వయస్సు 68 సం॥, హిందూ,గృహిణి, డి.నెం.4/898-1, గీతాశ్రమము రోడ్డు వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా ...పిటిషనర్/వాది
VS
పల్లా రామక్రిష్ణా,తండ్రి ఓబయ్య,వయస్సు 54 సం॥, హిందూ, వ్యాపారము, పాత అడ్రస్సు గుంతచేపాడు గ్రామం,చాపాడు మండలం,కడప జిల్లా ప్రస్తుత అడ్రస్సు ప్లాట్ నెం.205,గోకుల్ అపార్ట్‌మెంటు, వై.యం.ఆర్.కాలనీ,ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా ...రెస్పాండెంటు/ ప్రతివాది
నోటీసు
పై నెంబరు పిటిషన్ దావాను, దావా షెడ్యూలు దాఖల ఆస్తిపై ఇన్‌జంక్షన్ కోరి పిటిషనర్/వాది, రెస్పాండెంట్/ప్రతివాది యైన మీ పైన దావా దాఖలు చేసినారు. అట్టి పిటిషన్‌లో 06-09-2023వ తేదీన ఉదయం 10-30 గంటలకు రాజశ్రీ కోర్టునకు హాజరై మీ ఆక్షేపణలు మీ ద్వారాగాని వకీలు ద్వారా గాని తెలియజేయగలరు. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా చేసి మీకు పరోక్షముగా తీర్మానించబడను.
వాయిదా : 06-09-2023
ఎం.కరీముల్లా అలీ బేగ్
వాది తరపున అడ్వకేట్, ప్రొద్దుటూరు